క్లుప్తంగా

మునగపాక పీఎస్‌ను సందర్శించిన ట్రైనీ డీఎస్పీ



మునగపాక పీఎస్‌ను సందర్శిస్తున్న ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య

మునగపాక: మునగపాక పోలీసు స్టేషన్‌ను బుధవారం ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య సందర్శించారు. శిక్షణలో భాగంగా స్థానిక పీఎస్‌ను సందర్శించిన ఆయన పలు కేసుల వివరాలను ఎస్‌ఐ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం రూరల్: మండలంలోని 9 గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దిబ్బపాలెం, భోగాపురం, జంగులూరు, కుమారపురం, దుప్పితూరు, మార్టూరు, లంక ధర్మవరం, గొర్లి ధర్మవరం, కోనెంపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పాటిపల్లిలో దుర్గాలమ్మతల్లి పండగ నేడు



పాటిపల్లిలోని దుర్గాలమ్మ తల్లి

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

మునగపాక: ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లిలోని జోగినాయుడు మాష్టారు గ్రంథాలయం గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. తద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల కన్నుంనాయుడు, మళ్ల జోగినాయుడు, ఆడారి బాలాజీ, సూరిశెట్టి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న మల్లవరం సర్పంచ్ నాయుడు

మునగపాక: రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మల్లవరం సర్పంచ్ ఇందల హేమలత నాయుడు కోరారు. బుధవారం మండలంలోని మల్లవరం పంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు ఆయన విత్తనాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలను అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మెరుగైన దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు, అప్పారావు, వీఏఏ మౌల్య, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



శాంతినగర్ సచివాలయంలో ఆధార్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో మంజులా వాణి

అనకాపల్లి: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని డీఎల్‌డీవో మంజులా వాణి అన్నారు. స్థానిక గవరపాలెం శాంతినగర్ సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గవరపాలెంలో శాంతినగర్, నీలకంఠారావువీధి సచివాలయాల్లో ఈనెల 13వ తేదీ వరకూ ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

నాడు ఘనం.. నేడు దైన్యం

- నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం
- విద్యార్థులకు సమస్యల స్వాగతం
- కార్యరూపం దాల్చని ప్రభుత్వ ప్రకటనలు
- ఇప్పటి వరకు చేరని యూనిఫాం, బ్యాగులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ముందుగానే జగనన్న విద్యా కానుక అందజేత



శిథిలావస్థలో బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల



గత ప్రభుత్వంలో 'నాడు-నేడు' కింద నిర్మించిన నూతన భవనాలు

నక్కపల్లి: వేసవి సెలవులు అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం కింద విద్యా కిట్లు అందజేస్తామని ఆ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన కార్యరూపం దాల్చలేదు. ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు, బెల్టులు తప్ప మిగిలిన స్టేషనరీ, విద్యా మిత్ర కిట్లు పాఠశాలలకు చేరలేదు. ఇలా నూతన విద్యా సంవత్సరంలోకి అడుగిడుతున్న విద్యార్థులకు పాఠశాలల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరిచే సమయానికే జగనన్న విద్యా కానుక పేరుతో రెండు జతల యూనిఫాం, బూట్లు, సాక్సులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు సిద్ధం చేసేది. పాఠశాలల పునః ప్రారంభం రోజునే వచ్చిన విద్యార్థులకు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న విద్యా కానుక పేరు మార్చింది. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పేరుతో ఈ పథకాన్ని కొనసాగించేందుకు నిర్ణయించింది. ఈ పథకం కింద మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్సులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగు, బెల్టులు అందజేసామని ప్రకటించింది. అయితే ప్రస్తుతం అరకొరగా పుస్తకాలు, బెల్టులు మాత్రమే మండల రిసోర్స్ సెంటర్లకు చేరాయి. యూనిఫాం, బ్యాగులు, బూట్లు, సాక్సులు రావాల్సి ఉంది.

మండలంలో మొత్తం 75 పాఠశాలలున్నాయి. వీటిలో 43 బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, 3 ఫౌండేషన్ పాఠశాలలు, 17 మోడల్ ప్రైమరీ పాఠశాలలు, 12 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దాదాపుగా 6,100 మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వీరందరికి 65 వేల పుస్తకాలు అవసరమని అధికారులు ఇండెంట్ పెట్టారు. ఇప్పటి వరకు 55వేల పుస్తకాలు ఎంఆర్‌సీలకు చేరాయి.

ఒకటో తరగతిలో చేరాలంటే 2 కి.మీ. వెళ్లాల్సిందే..

గొడిచర్ల ప్రాథమిక పాఠశాలను మూసేసి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ప్రత్యేకంగా తరగతులు కేటాయించి ఒకటి నుంచి పదో తరగతి వరకు ఒకే చోట విద్యా బోధన చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామానికి జెడ్పీ ఉన్నత పాఠశాల రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అంత దూరం ఒకటో తరగతిలో చేర్పించేందుకు తమ పిల్లలను ఎలా పంపించాలని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ట్రాక్ దాటి జెడ్పీ పాఠశాలకు పంపించడం ఎంత వరకు రక్షణ అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకు ముందు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్చేవారమని, ఈ ఏడాది నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు ఆరేళ్ల వయసు కలిగిన పిల్లలను ఎలా పంపిస్తామంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫాం, బూట్లు రావాల్సి ఉంది..

పాఠ్య పుస్తకాలు 65 వేలకు గాను 55 వేలు వచ్చాయి. యూనిఫాం, బూట్లు సాక్సులు, బ్యాగులు రావాల్సి ఉంది. పాఠ్య, నోట్ పుస్తకాలను పాఠశాలలకు పంపించాం. విద్యా మిత్ర కిట్‌లు కూడా త్వరలోనే వస్తాయి. వచ్చిన వెంటనే విద్యార్థులకు అందజేస్తాం. కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలయింది. పూర్తయితే అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు నియమితులయ్యే అవకాశం ఉంది. అసంపూర్తిగా ఉన్న భవనాలకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

– కుంచం నరేష్, ఎంఈవో, నక్కపల్లి



ఎంఆర్‌సీ నుంచి పుస్తకాలను పాఠశాలలకు తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

పీఎస్ హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లు

స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రభుత్వం నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల జరిగిన బదిలీల్లో చాలా మంది ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా బదిలీపై వెళ్లిపోయారు. వారి స్థానంలోకి వచ్చేందుకు ఇతర ప్రాంతాల ఉపాధ్యాయులు ఆసక్తి చూపించడం లేదు. దీంతో జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు, భాషా ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, చినదొడ్డి గల్లు, దేవవరం, జెడ్పీహెచ్ బాలికల పాఠశాల, నక్కపల్లి, డీఎల్‌పురం, గొడిచర్ల, రాజయ్యపేట, బోదిగల్లం, వేంపాడు, ఉద్దండపురం తదితర పాఠశాలల్లో భాషా ఉపాధ్యాయులతో పాటు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించేందుకు ఉపాధ్యాయుల కొరత ఉంది. ఈ పాఠశాలల్లో ఇప్పటి వరకు బోధించే ఉపాధ్యాయులు చాలా మంది పీఎస్ హెచ్‌ఎంలుగా ఆప్షన్ పెట్టుకుని బదిలీపై వెళ్లిపోయారు. వారి స్థానంలో ఎవరూ రాకపోతే ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుంది. నక్కపల్లి మండలంలో పని చేసేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు ఆసక్తి చూపించడం లేదన్న ప్రచారం జరుగుతోంది.

అసంపూర్తిగా నాడు-నేడు పనులు

కూటమి ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరగలేదు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద పాఠశాలల్లో సుమారు రూ.33 కోట్లు వెచ్చింది అదనపు భవనాలు, మౌలిక సదుపాయాలు, బెంచీలు, ఐఎఫ్‌బీ ప్యానెళ్లు, ఆధునిక వసతులతో కూడిన మరుగుదొడ్లు, డైనింగ్ హాళ్లు, తాగునీరు, వాడుకనీరు సదుపాయాలు కల్పించింది. 70 శాతం పనులు గత ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న భవనాలకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. దేవవరం, చినదొడ్డిగల్లు, రాజయ్యపేట, రమణయ్యపేట, బోయపాడు, డీఎల్ పురం, ముకుందరాజుపేట, అయ్యన్నపాలెం, నక్కపల్లి పాఠశాలల్లో భవనాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఇక 82 మంది విద్యార్థులున్న పెదబోదిగల్లం పాఠశాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. కూర్చొనేందుకు గదులు కూడా బాగోలేదు. గచ్చులు గోతులు పడ్డాయి. కొంత మందికి ప్రాథమిక పాఠశాలల్లోనూ, మరికొంత మందిని ఇక్కడి పాఠశాలలో బాగా ఉన్న గదుల్లో కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు.



దొడ్డిగల్లులో అసంపూర్తిగా భవనాల నిర్మాణం

సాయిమెరైన్‌తో చర్చలు సఫలం

- వ్యర్థాల శుద్ధికి అంగీకారం
- స్థానికులకు 80 శాతం ఉద్యోగాల హామీ
- ఆందోళన విరమించిన గుడివాడ గ్రామస్తులు



ధర్నా అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న గ్రామ పెద్దలు

ఎస్.రాయవరం: మండలంలో సాయిమెరైన్ పరిశ్రమ వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నామని సోమవారం నుంచి గుడివాడ గ్రామస్తులు తలపెట్టిన నిరసనకు పరిశ్రమ యాజమాన్యం దిగొచ్చింది. పరిశ్రమ ప్రతినిధులతో బుధవారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో ఆందోళన విరమించినట్టు సర్పంచ్ దూళి శ్రీనుబాబు తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు యాజమాన్యం అంగీకరించినట్టు చెప్పారు. పరిశ్రమ నుంచి వ్యర్థాలను ముందుగా ప్లాంట్‌లో శుద్ధి చేసి కాలువలోకి విడుదల చేస్తామని, స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని, సీఎస్ఆర్ నిధులతో గ్రామాభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చినట్టు సర్పంచ్ తెలిపారు. ఈ చర్చలో గ్రామ మాజీ సర్పంచ్‌లు శ్రీపతిరాజు, నల్లపరాజు వెంకటరాజు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ, నాయకులు ఎం.రాజేష్, బి.రాంబాబు, డి.నానాజీ, ఎం.రమణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ

ఎస్.రాయవరం: పెట్టుగోళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పాడైన కోడిగుడ్లు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు గుడ్లు కుళ్లిపోవడమే కాకుండా, మరికొన్నింటిలో కోడిపిల్లల ఆకారాలు బయటపడ్డాయని బాలింత సర్వసిద్ధి భవానీ బుధవారం తెలిపారు. అంగన్‌వాడీ-1, 2 కేంద్రాలు ఒకే చోట బుధవారం బాలింతలు, గర్భిణులకు ఈ నెలలో కొన్ని రోజులకు గుడ్లు పంపిణీ చేశారు. అవి సాయంత్రం ఉడికించి తినేందుకు ప్రయత్నించగా.. కుళ్లిన వాసన, కోడిపిల్ల బయటకు రావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కాలం చెల్లిన గుడ్లు పంపిణీ చేస్తున్నట్టు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు వియ్యపు వరహాల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంపీడీవో, సీడీపీవోకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన చెప్పారు.



పాడైన అంగన్‌వాడీ కోడిగుడ్లను చూపుతున్న బాలింత భవానీ

ఆంజనేయుని సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం



అభయ ఆంజనేయస్వామి ఆలయంలో అక్షరాభ్యాసం చేసుకుంటున్న చిన్నారులు

పాయకరావుపేట: కుమారపురం గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం 40 మంది బాల బాలికలకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. దానధర్మ చారిటబుల్ వితరణ సభ్యుడు నీలాపు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు మర్లఫణి భాస్కర రామమూర్తి చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై డీఆర్వోకు వినతి

తుమ్మపాల: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం డీఆర్వో వై.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలపై వంద రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు కనీసం స్పందించడం లేదని, పీజీఆర్ఎస్‌లో అందజేసిన అర్జీలకు పొంతన లేని సమాధానాలతో అనకాపల్లి డిపో అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగుల సంఘం తీర్మానం మేరకు ఈ నెల 25 తర్వాత జిల్లావ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు తెలిపారు. కలెక్టర్ స్పందించి చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ అధికారులకు ఆదేశించాలని కోరారు. అంతకుముందు కలెక్టరేట్ గేటు వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఎరువుల కోసం వినతి



వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘ సభ్యులు

మునగపాక: సీజన్‌కు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ కోరారు. ఈ మేరకు బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన యూరియాను పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున యూరియా ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి దాడి శివ, రైతులు మళ్ల సంజీవరావు, బొడ్డేడ రాజు, ఆడారి లక్ష్మణరావు, దాడి భీమునాయుడు, సూరిశెట్టి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

124 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

మునగపాక: మునగపాక పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 124 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి అప్పలనాయుడు, కాశీ, ఆనంద్, టెక్కలి పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వృత్తి నిపుణుల సమావేశం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని విజయ రెసిడెన్సీలో గురువారం సాయంత్రం 5 గంటలకు వృత్తి నిపుణుల సమావేశం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు తెలిపారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు, లాయర్లు, వ్యాపార ప్రముఖులు, చార్టెడ్ అకౌంటెంట్స్, ఇంజినీర్లు, పారిశ్రామికవేత్తలతో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ఉపాధి హామీ కార్మికులకు తక్షణం బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: ఉపాధి హామీ కార్మికుల బకాయి వేతనాలు తక్షణం మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంకటాపురంలో పని ప్రదేశంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వేతనదారులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 వారాలుగా పెండింగ్ వేతనాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పని చేసిన కాలానికి సకాలంలో వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. పని ప్రదేశంలో ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని, ప్రభుత్వం విడుదల చేసిన జీవో మేర రూ.309 వేతనంగా అందించాలన్నారు. లైవ్ ఆడిట్ పేరిట కార్మికులను వేధించే విధానాలను మానుకోవాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు అందించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి కార్మికులు చిన్న లోవరాజు, రామునాయుడు, రామలక్ష్మి, లావణ్య, పద్మ, నరసింగరావు, నీలకంఠారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక



కైలాసపట్నంలో ఏరువాక నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

కోటవురట్ల: నేల ఆరోగ్యంతోనే పంటల్లో అధిక దిగుబడి సాధ్యపడుతుందని జాతీయ మత్స్య పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త విజి తెలిపారు. మండలంలోని రామచంద్రపురం కైలాసపట్నం గ్రామంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతిలో ఎద్దులకు నాగలి కట్టి పొలం దుక్కి చేపట్టారు. శాస్త్రవేత్త విజి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగు కోసం అనేక పథకాలను అందిస్తున్నాయని, రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మరో శాస్త్రవేత్త వి.ప్రసాదరావు మాట్లాడుతూ వరిలో సుడోమోనాస్ లేదా కార్బెండిజమ్‌తో విత్తన శుద్ధి చేయడం వల్ల నారు మడుల్లో తెగుళ్లను నివారించవచ్చన్నారు. నూతన వంగడాలు ఎంటీయూ 1224, ఎంటీయూ 1262, ఎంటీయూ 1318 రకాల సాగుతో మంచి దిగుబడులు సాధ్యపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ గౌడ్, వ్యవసాయాధికారి సరోజిని, రైతులు పాల్గొన్నారు.

బస్సు దగ్ధంపై సమగ్ర విచారణ జరపాలి

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీ నుంచి చోడవరం వెళుతున్న బస్సు అగ్నిప్రమాదానికి గురైన సంఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక పక్క ఫార్మాకంపెనీల్లో ప్రమాదాలు జరిగి అనేక మంది కార్మికులు మరణిస్తుండగా, మరో పక్క ఫార్మాకంపెనీలకు కార్మికులు, ఉద్యోగులను తరలించే బస్సులు రహదారి, అగ్ని ప్రమాదాలకు గురవుతున్నాయని తెలిపారు. కాలం చెల్లిన బస్సుల్లో కార్మికులను తరలించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపడంతో పాటు ఫార్మా, ఇతర పరిశ్రమలకు కార్మికులను తీసుకువెళుతున్న బస్సుల ఫిట్‌నెస్, ఇతర సౌకర్యాలపై ఆర్టీవో అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, కార్మికుల భద్రత కల్పించాలన్నారు.

కాలంచెల్లిన బస్సులతో ప్రమాదాలు : కాలం చెల్లిన ఫార్మా,బ్రాండిక్స్ బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతుండడంతో కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోందని, జిల్లా రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని జిల్లా రైతు కూలీసంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పరవాడ ఫార్మాకంపెనీ నుంచి చోడవరం వెళుతున్న బస్సులో అనకాపల్లి మండలం బవులవాడ వద్ద ఆకస్మికంగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయిందని, బస్సులో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం యలమంచిలి వద్ద బ్రాండిక్స్ కంపెనీ బస్సు ప్రమాదానికి గురై, పలువురు కార్మికులు గాయపడ్డారని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ యాజమాన్యాలపైన, బస్సుల కాంట్రాక్టర్లపై పరిశ్రమల అధికారులు, రవాణా శాఖ తగిన చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని తెలిపారు. ప్రతి ఏడాది బస్సులను ఆర్టీవో అధికారులు తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు.

25న ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా మహాసభ



ప్రజానాట్య మండలి జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గొర్లి దేముడుబాబు

అనకాపల్లి: ప్రజానాట్య మండలి జిల్లా ప్రథమ మహాసభను ఈనెల 25న స్థానిక కొడుగంటి గోవిందరావు భవనంలో నిర్వహించనున్నట్టు ప్రజానాట్య మండలి జిల్లా ప్రతినిధి గొర్లి దేముడుబాబు తెలిపారు. ఈ సభకు సంబంధించిన కర పత్రాలను స్థానిక మెయిన్‌రోడ్డులో గల వై.విజయకుమార్ హాల్లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ ప్రజల కోసమేనన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం ప్రజలను జాగృతి చేసేందుకు ప్రజానాట్య మండలి కృషి చేస్తోందని చెప్పారు. ఎంతోమంది కళాకారులను, రచయితలను సృష్టించిందన్నారు. కార్పొరేట్ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాట్యమండలి మండల సభ్యులు కొండూరి వీరాచారి,రాజాన దొరబాబు, వియ్యపు రాజు, కోరుమిల్లి శంకరరావు, విత్తనాల పోతురాజు, ముత్తూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.